

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా శరత్

సంగారెడ్డి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో నిధుల వినియోగం, ప్రజలకు చేరువవుతున్న తీరుపై పరిశీలన చేయనున్నారు. శరత్ గతంలో ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పని చేశారు.

గోదావరి జలాలను ఎత్తిపోయకుంటే సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్ల పరిస్థితి అగమ్యగోచరమే. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నా, స్థానికంగా ఈ రిజర్వాయర్లకు చేకూరే ప్రయోజనమేమీ లేదు. ఇక్కడి వర్షపు నీరు వాగులు, చెరువులకు చేరుతుంది తప్ప, ఒక్క చుక్క రిజర్వాయర్లకు చేరదు. రిజర్వాయర్లు జలకళను సంతరించుకోవాలంటే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఎత్తిపోతలైనా ప్రారంభం కావాలి.. లేదంటే గోదావరి నది ఎగువ ప్రాంతంలో వర్షాలు పడి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి వరద పోటెత్తాలి. ఈ రెండూ అసాధ్యమైతే ఏడాదంతా జిల్లాలోని రిజర్వాయర్లు వెక్కిరిస్తూ దర్శనమివ్వడం ఖాయం. ఫలితంగా సాగు అవసరాలకు తీరని కష్టాలు తప్పవని రైతాంగం ఆందోళన చెందుతోంది.


మల్లన్నసాగర్ రిజర్వాయర్

ఉత్తి పోతలు!

జిల్లాలోని రిజర్వాయర్లు నిండేదెలా?


రంగనాయకసాగర్ రిజర్వాయర్

- కాళేశ్వరం ఎత్తిపోతలు ప్రారంభించకుంటే గతేంటి?
- జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నా నిష్ప్రయోజనమే
- మిడ్‌మానేరులోనూ నీరు అంతంతమాత్రమే
- ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ వరద నీటిపైనే రైతుల ఆశలు
- ఎత్తిపోయకుంటే వ్యవసాయం సాగడం కష్టమే

సిద్దిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాగు, తాగునీటి అవసరాలు తీర్చడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను నిర్మించారు. గోదావరి జలాల ఎత్తిపోతనే వీటికి ఆధారం. గతంలో మేడిగడ్డలో ఎత్తిపోస్తే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మీదుగా ఎల్లంపల్లి ప్రాజెక్టు, నందిమేడారం నుంచి మిడ్‌మానేరుకు తరలించేవారు. మిడ్‌మానేరు నుంచి జిల్లా సరిహద్దులో ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌కు అక్కడి నుంచి రంగనాయకసాగర్ మీదుగా మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోయడం చేసేవారు. అయితే మేడిగడ్డ వద్ద ఎత్తిపోతల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో రిజర్వాయర్ల పరిస్థితి ప్రశ్నార్థకమైంది.

రిజర్వాయర్లలో డెడ్‌స్టోరేజీ

3.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.24 టీఎంసీలు, 3 టీఎంసీలు నిల్వ ఉండే రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో కేవలం ఒక టీఎంసీ, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 4.85 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో క్రితంసారి 20 టీఎంసీలు ఎత్తిపోయగా ప్రస్తుతానికి సగం మాత్రమే మిగిలాయి. ఇక 15 టీఎంసీల కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరింది. ఇక జిల్లాలోని ఈ రిజర్వాయర్లు అన్నింటికి ప్రధాన ఆధారమైన

మిగతా 8వ పేజీలో




సిద్దిపేటలో చిరువ్యాపారుల ఇక్కట్లు

బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో మత్తడి దూకుతున్న మోయతుమ్మెద వాగు


నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో కూలిన ఇంటి గోడ

ముసురు

- ఎడతెరిపిలేని వాన
- పొంగిపొర్లుతున్న మోయతుమ్మెద వాగు
- మూడురోజుల వర్షంతో తడిసి ముద్దయిన జిల్లా
- పంటలకు జీవం..అన్నదాత హర్షం


కుకునూర్‌పల్లిలో కురుస్తున్న వాన

సిద్దిపేట జూలై 25 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి సిద్దిపేట జిల్లా తడిసిముద్దయింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు 2 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచే మబ్బులు కమ్మేయడంతో ఉదయం నుంచి ముసురు వాన పడగా, మధ్యాహ్నం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. జిల్లాలో గరిష్ఠంగా 35.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో మోస్తారు వర్షం కురిసింది. బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్‌లోని మోయతుమ్మెద వాగు పొంగిపొర్లుతున్నది. నారాయణరావుపేట మండలంలోని జక్కాపేర్ గ్రామానికి చెందిన మెరుపుల మల్లవ్వ, లక్ష్మీదేవిపల్లికి చెందిన బొంగురం శ్రీలతలకు చెందిన శిథిలావస్థకు చేరిన ఇళ్ల గోడలు కూలిపోయాయి. జిల్లాలోని

మిగతా 8వ పేజీలో

గరిష్ఠంగా 35.8 మి.మీ.ల వర్షపాతం నమోదు

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి కొమురవెల్లిలో గరిష్ఠంగా 35.8 మిల్లీమీటర్ల (మి.మీ.) వర్షపాతం నమోదైంది. తొగుట మండలంలో 35.5 మి.మీ., కోహెడలో 35.3, నారాయణరావుపేటలో 29.5, అక్కనపేటలో 28.3, చేర్యాల 28.0, సిద్దిపేట రూరల్‌లో 25.5, దౌల్తాబాద్‌లో 25.0, హుస్నాబాద్‌లో 23.0, సిద్దిపేట అర్బన్ 22.8, కొండపాక 22.3, మద్దూరు 21.3, దుబ్బాకలో 21.3, బెజ్జంకిలో 20.8, మిరుదొడ్డిలో 20.5, మర్కూక్ 20.5, అక్బర్‌పేట-భూంపల్లిలో 20.0, నంగునూరులో 19.5, చిన్నకోడూర్‌లో 18.8, దూలిమిట్ట 18.3, రాయపోల్‌లో 17.0, ములుగు 16.5, జగదేవ్‌పూర్ మండలాల్లో 15.8 మి.మీ.ల వర్షం కురిసింది.



శ్రావణ సందడి

శ్రావణమాసం సందర్భంగా సిద్దిపేట పట్టణంలో ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. పారుపల్లి వీధిలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు. వచ్చే నెల 8న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పొడిచేటి రామకుష్ణాచార్యులు తెలిపారు. మంగళగౌరి నోములు చేయనున్నట్లు చెప్పారు.

\- సిద్దిపేట కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి)

వర్షంలో హాయ్ హాయ్



జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వానలతో ఒకవైపు రైతులు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. సామాన్యులు, విద్యార్థులకు చిన్నపాటి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యగా ఉదయం, సాయంత్రం వాన వస్తుండడం ముసురులోనే విద్యార్థులు బడులకు పయనమై, అదే వానలో ఇంటి బాట పట్టాల్సి వస్తున్నది. విద్యార్థులు గొడుగులు పట్టుకొని, రెయిన్ కోట్లు వేసుకుని, బాలికలు చున్నీలు కప్పుకుని హాయ్‌గా వెళ్తున్నారు. శుక్రవారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద చల్లని వాతావరణంలో చినుకులు తడుపుతుండగా ఇలా ఇంటికి వెళ్తూ కనబడ్డారు.

\- జిల్లా ఫొటోగ్రాఫర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి)





హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయాలి

- సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో నిర్వహించబోయే హాఫ్ మారథాన్ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రేపు నిర్వహించనున్న హాఫ్ మారథాన్ టీ షర్ట్‌లను శుక్రవారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, జిల్లా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు రంగాచారితో కలిసి ఏసీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను కూడా రన్నింగ్, కబడ్డీ పోటీల్లో పాల్గొని చాంపియన్‌గా నిలిచానన్నారు. సిద్దిపేటలో హాఫ్ మారథాన్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కౌన్సిలర్ బ్రహ్మం, సీనియర్ జర్నలిస్టులు రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సిద్దిపేట మేటి

- కొడంగల్, నిజామాబాద్ అధికారుల కితాబు

సిద్దిపేట జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో సిద్దిపేట మేటి అని కొడంగల్, నిజామాబాద్ జిల్లా నగరపాలక సంస్థలకు చెందిన ఈఈ వెంకటేశ్వర్లు, అధికారులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ విధానాన్ని, ఎస్‌టీపీ ప్లాంటు, కోమటిచెరువు అభివృద్ధి పనులను వారు సందర్శించగా మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మాజీ చైర్మన్ రాజనర్సు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కోమటిచెరువుపై ఏర్పాటు చేసిన రూబీ నెక్లెస్‌రోడ్, నైట్‌గార్డెన్, సస్పెన్షన్ బ్రిడ్జి, పిల్లల ఆట వస్తువులు, యోగా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సాయిబాబా ఆలయం, దోబిగల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. యూజీడీ మురుగు నీటిని ఎస్‌టీపీ ప్లాంట్ వద్ద శుద్ధి చేసి తాగునీటి యేతర అవసరాలకు వినియోగిస్తున్న తీరును అధికారులు వారికి వివరించారు. వారి వెంట వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, డీఈ ప్రేరణ, ఏఈలు పృథ్వీ, శ్రీనాథ్, నిజామాబాద్ నగరపాలక సంస్థ, కొడంగల్, కోస్గి అధికారులు తదితరులు ఉన్నారు.

నిర్ణీత వ్యవధిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- హుస్నాబాద్- కొత్తపల్లి నాలుగు లేన్ల రహదారి పనులు ప్రారంభించాలి : కలెక్టర్ హైమావతి


ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా స్టాక్ వివరాలను అధికారులను అడుగుతున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను నిర్ణత కాల వ్యవధిలో పూర్తి చేయించాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె హుస్నాబాద్ ఐవోసీలో నిర్వహించిన హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్లు, భవనాలు, అంగన్‌వాడీ సెంటర్లు, రహదారులను పూర్తి చేయించాలని, మొదలు కాని పనులను ప్రారంభించాలన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మిస్తున్న నాలుగు లేన్ల రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పట్టణంలోని కమ్యూనిటీహాళ్లు, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. 150 పడకల ఆసుపత్రి పనులను మొదలు పెట్టడంలో జాప్యం చేయవద్దన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి సుముఖంగా లేని లబ్దిదారుల నుంచి రాత పూర్వకంగా లెటర్ తీసుకొని పేరు తొలగించి పేద లబ్దిదారులకు అందించాలన్నారు. ఈ నెలలో 3,140 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయని, 850 మెట్రిక్ టన్నుల బ్యాలెన్స్ ఉందన్నారు. అన్నిషాపుల్లో స్టాక్ రిజిస్టర్ మెయింటెన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

దౌల్తాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అధికారుల పనితీరు బాగాలేదని, పొంతన లేని సమాధానం చెప్పడం సరైనది కాదని, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. శుక్రవారం ఆమె దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత మంది రైతులకు, ఎన్ని టన్నుల యూరియా అమ్మారని పీఏసీఎస్ అధికారులను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోవడంపై వైద్యాధికారులపై మండిపడ్డారు. మండల కేంద్రంలోని జడ్పీ బాలుర, కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి, విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్ గఫూర్, వ్యవసాయ శాఖ అధికారి సాయికిరణ్, ఎంఈవో గజ్జల కనకరాజు, మాజీ సర్పంచ్ మాది వేణుగోపాల్, సొసైటీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించిన మంత్రి సీతక్క


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జిల్లా అధికారులు

సిద్దిపేట జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె అధికారులతో కలిసి అకాల వర్షాలు, శానిటేషన్, సీజనల్ వ్యాధులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదనపు గరీమాఅగ్రవాల్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాల్లో వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ చెరువులు, కెనాల్‌ల వద్ద నీరు ఉప్పొంగి ప్రవహించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. వైద్య శాఖ అధికారులు ప్రతీరోజూ పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలని, అవసరమైన చోట ఫీవర్ సర్వేలు నిర్వహించాలని సూచించారు.

మహిళకు డబ్బులు ఇస్తామంటూ..
చిన్నారిని ఎత్తుకెళ్లే యత్నం

హుస్నాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : భిక్షాటన చేసుకుంటున్న మహిళ వద్ద బాబును తీసుకెళ్లాలని గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న తెలంగాణ కాంప్లెక్స్ వద్ద తన కుమారుడిని ఎత్తుకొని ఓ మహిళ భిక్షాటన చేస్తున్నది. గుర్తుతెలియని వ్యక్తులు మహిళ దగ్గరకు వచ్చి రూ.500 ఇచ్చి బాబును తమకు అప్పగించాలని బెదిరించారు. దీంతో భయపడిన మహిళ ఏడుస్తూ బస్టాండ్‌కు వచ్చింది. దీనిని గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఆమె నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధిత మహిళ జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన కోమల అని చెప్పింది. వెంటనే బాబుతో పాటు ఆమెను బస్సులో ప్రయాణికులతో కలిపి తరిగొప్పులకు పంపించారు. ఇది వాస్తవమా, లేక కల్పితమా అనే విషయంపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

7

నాడు కళకళ.. నేడు వెలవెల

- సర్కారు బడుల్లో టీచర్లు కరువు
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- ప్రైవేటుకే మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులు

నంగునూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఆ పాఠశాలలు నేడు వెల వెలబోతున్నాయి. 'ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన స్థాయి పెంచుతున్నాం' అంటూ ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత మూలంగా బడిలో పిల్లలు చేరడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10, ప్రాథమికోన్నత పాఠశాలలు 10, ప్రాథమిక పాఠశాలలు 18, ఒక మోడల్ స్కూల్, ఒక కస్తూర్బా గాంధీ పాఠశాల ఉంది. ప్రభుత్వ విధానాల్లో మారిన సంస్కరణ నేపథ్యంలో 11 మంది ఉన్న విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 40 మంది పైన ఉంటే ముగ్గురు, 90పైన పిల్లలు ఉన్న పాఠశాలలకు నలుగురు ఉపాధ్యాయుల చొప్పున నియమిస్తున్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్ పాఠశాలలో 25 మంది విద్యార్థులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులు, వెంకటాపూర్ గ్రామంలో 40 మంది విద్యార్థులకుగాను ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, అందులో నుంచి ఒకరిని చిన్నకోడూరు మండలం మాచాపూర్, మరొకరిని జేపీ తండాకు డిప్యూటేషన్ వేశారు. 80 నుంచి 90 మంది విద్యార్థులునన ఉన్న నర్మెట్ట పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు గాను ఒకరిని ఖానాపూర్, మరొకరిని కొండంరాజుపల్లికి డిప్యూటేషన్ వేశారు. మండలంలోని గట్ల మల్యాల మధిర సంతోషనగర్, కోనాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తక్కువ ఉండడంతో ఒకే ఉపాధ్యాయురాలని కేటాయించారు. కోనాయిపల్లి పాఠశాలలో ఒకటవ తరగతిలో ముగ్గురు, రెండవ తరగతి ఐదుగురు, మూడవ తరగతిలో ఒక్కరు కూడా లేరు. నాలుగో తరగతిలో ఇద్దరు, ఐదవ తరగతిలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

ప్రైవేట్‌కే మొగ్గు..

కోనాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ సరైన ఉపాధ్యాయులు లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో తల్లిదండ్రులు సిద్దిపేటలోని ప్రైవేట్ పాఠశాలకు తరలిస్తున్నారు. గ్రామంలో సుమారుగా 50 నుంచి 60 మంది ఐదవ తరగతి లోపు విద్యార్థులు ఉన్నప్పటికీ 14మంది స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా, సమీపంలోని ముండ్రాయి పాఠశాలకు 17 మంది వెళ్తున్నారు. అలాగే మిగతా విద్యార్థులు సిద్దిపేటలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు.

శిథిలావస్థలో మరికొన్ని పాఠశాలలు...

మండలంలోని వివిధ పాఠశాలలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. ప్రధానంగా కోనాయపల్లి పాఠశాలతో పాటు రాంపూర్, మగ్దుంపూర్ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. కోనాయపల్లి పాఠశాలలో రెండు గదులు మాత్రమే కొద్దిగా బాగున్నాయి. మిగతా గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు అధ్వానస్థితిలో ఉన్నాయి. వంటగది పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఇక్కడ పాఠశాల ఆవరణలోనే గ్రామపంచాయతీ సంబంధించి ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ వస్తువులన్నీ ఉంటాయి. విలేజ్ నర్సరీ కూడా అందులోనే ఏర్పాటు చేశారు. పిల్లలు మూత్రశాలలకు వెళ్లాలంటే చుట్టూ గడ్డి మొలిచి వెళ్లలేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్డి ఉన్నప్పటికీ చుట్టూ వేపుగా గడ్డి పెరిగి అందులోకి ఎలా వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. రాంపూర్ పాఠశాల భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. మగ్దుంపూర్ ప్రైమరీ స్కూల్లో పురాతన భవనాల్లో విద్యాబోధన జరుగుతుంది, వర్షాకాలం వస్తే వురుస్తుంది. ఇక్కడ నాలుగు భవనాలు కొత్తవి నిర్మించినప్పటికీ. గదులు సరిపోకపోవడంతో శిథిలావస్థలో ఉన్న గదులలోనే విద్యాబోధన చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్కువ పిల్లలు ఉన్న దగ్గర ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థుల శాతాన్ని పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో కోనాయిపల్లిలోని పురాతన భవనాలు

ఆ టీచర్లను తొలగించొద్దు

నిజాంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆ టీచర్లను తొలగించొద్దు.. తక్షణమే డిప్యూటేషన్ రద్దు చేయాలంటూ గ్రామస్థులు పాఠశాల ఎదుట నిరసనకు దిగారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలకు చేరుకున్న గ్రామస్థులు ప్రైవేట్‌కు తమ పిల్లలను పంపకుండా.. ఈ పాఠశాలకు పంపిస్తే చక్కగా బోధించే పంతుళ్లను వేరేచోటుకు మారుస్తారా.. అంటూ మండిపడ్డారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులకుగాను నలుగురు టీచర్లు ఉండగా.. ఇటీవల ఇరువురిని మరో చోటుకు మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సాంగనీ యాదగిరి ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌పై జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తానని నచ్చజెప్పడంతో గ్రామస్థులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ఎదుట గ్రామస్థుల నిరసన

చదువుల తల్లులకు ఘన సత్కారం

- ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు

కంది, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పేదింటి కుసుమాలు చదువుల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. తల్లిదండ్రులు కూలీనాలి చేసి చదివించినందుకు చక్కని ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రైవేటుకు దీటుగా నిలిచారు. పదో తరగతిలో సంగారెడ్డి జిల్లా టాప్-10 ర్యాంకుల్లో 4 కైవసం చేసుకున్నారు. 2024-25 చేర్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు వడ్ల గాయత్రి-588, హమీల్బార్ త్రిషిక-586, ఆల్ఫియా-582, అభినయ-581 మార్కులతో నలుగురు జిల్లా టాప్ టెన్ ర్యాంకుల్లో నిలిచారు. కే.పూజిత, సంజన, చంద్రిక, తేజస్విని, వర్షిణి, మైత్రి, అక్షిత, పావని, నిశాంతి 550కి పైగా మార్కులు సాధించారు. ఒకేసారి 13 మంది విద్యార్థినులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. విద్యార్థినులను, ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు చేవెళ్ల వెంకట్‌రెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, చదువుల ఖర్చులకు కొంత నగదు అందజేశారు. తమ గ్రామంలో 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందడం తమకు గర్వకారణమన్నారు. తమ విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ వసంత్‌రెడ్డి, హెచ్ఎం రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చేర్యాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులను, ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామ పెద్దలు

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

- సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని గోవర్ధనగిరి, వర్ధరాజ్‌పల్లి, లింగంపేట, ముత్యంపేట, గుడికందుల పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రుచికరమైన భోజనం పెడుతున్నారా, విద్యాబోధన ఎలా ఉందని ఆరాతీశారు. బేస్‌లైన్ పరీక్ష నిర్వహించారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా గుడికందుల పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఎంఈవో నర్సయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, సీఆర్‌పీ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రీమ్‌వెల్లీ కాలనీలో కుక్కల బెడద

- కుక్కకాటుతో పలువురికి గాయాలు

జహీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో కుక్కల బెడద అధికమైంది. ఏవార్డులో చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దారిగుండా వెళ్తున్న వారిని వెంబడిస్తూ కరుస్తున్నాయి. ప్రతినెల 10 వరకు కుక్కకాటుకు సంబంధించిన కేసులు వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని డ్రీమ్‌వెల్లీ కాలనికి చెందిన నిఖిత(8)తోపాటు పలువురు కుక్కకాటుకు గురయ్యారు. ఎక్కువ గాయాలకు గురైన నిఖితను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇటుక బట్టీలపై అధికారుల దాడులు

- మూడు ట్రాక్టర్లకు చలాన్ల విధింపు

చిన్నశంకరంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై మైనింగ్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని గవ్వపల్లి, అంబాజీపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నుంచి ట్రాక్టర్లతో పలు గ్రామాలకు అధికారుల అనుమతులు లేకుండా ఇటుకను సరఫరా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. గవ్వపల్లికితండాకు చెందిన కట్రోత్ పంతుల్యా ట్రాక్టర్‌కు రూ.20 వేలు, అంబాజీపేటకు చెందిన బాబాగౌడ్ రెండు ట్రాక్టర్లకు కలిపి రూ.40 వేలు, మొత్తం రూ.60 వేల చలాన్ విధించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్‌శాఖ ఆర్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసిస్టెంట్ మలేరియా అధికారిగా కాట్రోత్ చందర్

మెదక్, కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారిగా కాట్రోత్ చందర్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం నియామకపత్రాన్ని అందజేశారు. చందర్ పాపన్నపేట మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తూ, శుక్రవారం అసిస్టెంట్ మలేరియా అధికారిగా నియమితులయ్యారు. కార్యక్రమంలో హరిప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్

మునిపల్లి, జులై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 1.250 గ్రాముల ఎండు గంజాయి, రూ.9,500 నగదు, కారు, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరీ, మునిపల్లి ఏఎస్సై బక్కన్న కేసు వివరాలను వెల్లడించారు. రాయికోడ్ మండలం నాగన్‌పల్లికి చెందిన వడ్డె నర్సింహులు, కొండాపూర్ మండలం గారకూర్తికి చెందిన వెంకట్‌రెడ్డి బీదర్‌లోని ఇరానీగల్లీ నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు కంకోల్ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారు, బైక్‌లపై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా, 1,250 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఈ మేరకు నిందితుల నుంచి గంజాయితో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో కొండాపూర్ ఎస్సై సోమేశ్వరీ, మునిపల్లి ఏఎస్సై బక్కన్నతో పాటు పోలీసు సిబ్బంది హనీఫ్, పాండు, ఆనంద్, సంతోష్, డ్రైవర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన ఎండు గంజాయి

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయానికి యత్నించిన పట్టణానికి చెందిన పచ్చిమడ్ల రామును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన రాము 9వ తరగతి వరకు చదువుకున్నాడు. ఉపాధి నిమిత్తం పట్టణ శివారులోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేశాడు. కానీ కొంతకాలం క్రితం పని మానేసిన క్రమంలో గంజాయి సేవనానికి అలవాటుపడ్డాడు. డబ్బుల కోసం గంజాయి విక్రయానికి అడుగులు వేశాడు. ఈక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లోని అన్నసాగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయానికి ప్రయత్నిస్తున్న క్రమంలో స్థానిక అయ్యప్ప కాలనీ సమీపంలో టాస్క్‌ఫోర్స్, పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 122 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కాగా తమ పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఇందులో చేర్యాల ఎస్ఐ నవీన్, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరిపై కేసు

నర్సాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులతో పనిచేయిస్తున్న ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. శుక్రవారం అసిస్టెంట్ లేబర్ అధికారి నేతృత్వంలో పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ మార్గంలోని ఓ బట్టల దుకాణంలో 17 ఏళ్ల బాలుడు, బస్టాండ్ సమీపంలోని ఓ పూల దుకాణంలో 16 ఏళ్ల బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించి సదరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత


చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులో లారీని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చిన్నకోడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైఫ్అలీ వివరాల ప్రకారం.. అనుమతి లేకుండా గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు లారీలో ఇసుక తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యం


లావణ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన గజ్వేల్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్ నగర్‌లోని అరుంధతినగర్‌కు చెందిన కాలల్ లావణ్య(21) గజ్వేల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ బాలికల హబ్‌లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. 24న కళాశాలకు వెళ్లిన లావణ్య సాయంత్రం హాస్టల్‌కు తిరిగి రాలేదు. హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు బంధువుల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. లావణ్య తండ్రి మల్లికార్జున్ మేడ్చల్ జిల్లా బాలాజీనగర్‌కు చెందిన విష్ణుపై అనుమానం వ్యక్తం చేస్తూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన పొన్నబోయిన ప్రభాకర్‌కు చెందిన పాడి గేదె రోజులాగే శుక్రవారం వ్యవసాయ బావి వద్ద గడ్డి మేస్తున్నది. ఈ క్రమంలో పరిసరాల్లోనే విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగిలి మృతిచెందింది. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభాకర్ వేడుకుంటున్నాడు.

ఉద్యోగులు సంఘటితం కావాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు సమస్యల సాధన కోసం సంఘటితం కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సహకార శాఖ ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ వ్యవస్థ ప్రమాదంలో ఉందని, నిర్వీర్యం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగిపై ఉందన్నారు. అంతకుముందు సహకార శాఖ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా సహకార శాఖ ఉద్యోగులకు పెద్దఎత్తున పదోన్నతులు కల్పించామన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహకారశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామాగౌడ్, కార్యదర్శిగా సంగమేశ్వర్, కోశాధికారిగా యాకూబ్ అలీతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, వివిధ యూనిట్ అధ్యక్షులు, ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌కు ప్రపంచ దేశాల ప్రశంసలు

● ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌రమేశ్ సిరియాల్



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేశ్ సిరియాల్

సంగారెడ్డి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌ను ప్రపంచ దేశాలు ప్రశంసించాయని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌రమేశ్ సిరియాల్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత వైమానిక, నౌకా దళాలు సంయుక్తంగా పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపి ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాయని గుర్తుచేశారు. భవిష్యత్‌లో ఎటువంటి ఉగ్రవాద చర్యలు భారతదేశంలో కొనసాగించినా ప్రతిఫలంగా చర్యలు తీసుకుంటుందని ప్రపంచ దేశాలకు భారత్ చాటి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఎన్‌సీసీ అధికారి విజయ, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సంగారెడ్డి



జోగిపేట ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ సంగారెడ్డి ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం వ్యాధులు సోకే సీజన్ కావడంతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్లు సమయపాలన పాటించాలని, సిబ్బంది వైద్యసేవలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రిలో చేరిన రోగులకు సమయానికి మెనూ ప్రకారం డైట్ ఫుడ్, పాలు, ఇడ్లీ, బ్రెడ్, పండ్లతో పాటు ప్రభుత్వం అందజేసే పోషకాహారాలను రోగులకు రోజూ అందజేయాలన్నారు. కాగా ఆస్పత్రికి వచ్చిన సంగారెడ్డి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఆర్‌ఎంవో డాక్టర్ అశోక్‌తో కలిసి ప్రతీ వార్డులో కలియతిరిగారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరాతీశారు. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

రాచన్నస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి భక్తులు లక్ష బిల్వార్చన చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శ్రావణమాసం ముగింపు వరకు ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తామని ఈవో శివరుద్రప్ప తెలిపారు.

వర్టికల్ విభాగాల్లో ప్రతిభ చూపాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

మునిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్టికల్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిపేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మండల పరిధిలోని బుదేరా చౌరస్తా పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అన్ని రకాల విధులను తెలుసుకుని ఉండాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి విధులలైనా.. చేయగలిగే విధంగా పరిజ్ఞానం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో హిస్టరీ షీట్లు, పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రమాద అంచున ఉన్న చెరువులు, కుంటల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట స్టేషన్ ఇన్‌చార్జి, ఏఎస్‌ఐ బక్కన్న, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

వర్షాకాలం.. జర పైలం

● పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
● రైతులు, మూగజీవాలకు ముప్పు
● అప్రమత్తతతోనే రక్షణ అంటున్న అధికారులు

చిన్నకోడూరు/వెల్దుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అసలే వర్షాకాలం ఇంటా.. బయట విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడడం వంటివి జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా ఉంటారని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలకు కారణాలు

● గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యన, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టూ కంచె లేకపోవడం



వెల్దుర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

● గ్రామాల్లో ఇళ్ల పైనుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం

● వ్యవసాయ బావుల వద్ద పంట పొలాల్లో చేతికందే ఎత్తులో, కర్రలపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం

● వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటం వల్ల, విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగడం, విరిగిపోవడం వంటివి జరిగి ప్రమాదాలకు కారణమవుతాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్న తీరు

● ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ వైర్లు మార్చడం, చిన్న చిన్న మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి విద్యుత్‌షాక్‌కు గురికావడం

● వర్షాకాలంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలు తెగిపడడంతో ప్రమాదాలు జరగడం

● వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్‌కు సరైన వైరింగ్ లేకపోవడం వల్ల ఏమరపాటుతో ప్రమాదాలు సంభవించటం

● స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ వైరు కనెక్షన్ పొదల్లో ఉండి గడ్డి కోస్తున్నప్పుడు ప్రమాదాలు జరగటం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను తాకొద్దు.

● తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లను, పరికరాలను ముట్టుకోవద్దు.

● పశువులను విద్యుత్ స్తంభాలకు, సమీపంలో కానీ కట్టి వేయొద్దు.

● పంట పొలాల వద్ద బావి, బోరు మోటార్లు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దు.

● నాణ్యమైన స్టార్టర్ డబ్బాలు, సర్వీసు వైరు వాడాలి.

● విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి, అదేవిధంగా స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి.

● ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ఇంట్లోని టీవీ, కంప్యూటర్, ఫ్రిడ్జ్ వంటివి ఆఫ్ చేయాలి.

సొంతంగా మరమ్మతులు వద్దు



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే సొంతంగా మరమ్మతులు చేయకూడదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

- చాంద్‌పాషా, విద్యుత్‌శాఖ ఏఈ, చిన్నకోడూరు సెక్షన్

విద్యుత్ సమస్య వస్తే చెప్పాలి



గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్య వస్తే వెంటనే 8712473367కు సమాచారం అందించాలి. రైతులు పంట పొలాలు, బోరు బావుల వద్ద మోటార్లను, స్టార్టర్లను తడి చేతితో ముట్టుకోవద్దు. ఇంట్లో చిన్నపిల్లలను కరెంట్ వస్తువుల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి. స్తంభం నుంచి ఇళ్లకు వచ్చే విద్యుత్ సర్వీస్ వైర్ దెబ్బతింటే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలి. విద్యుత్ సమస్యలు వస్తే సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు.

- పెంట్యానాయక్, వెల్దుర్తి, విద్యుత్‌శాఖ ఏఈ, వెల్దుర్తి

మూగజీవాల పరిహారం అందేదెప్పుడో..?

● పిడుగుపాటుకు పశువుల మృత్యువాత ● పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు



మృత్యువాతపడిన ఎద్దు వద్ద రోదిస్తున్న రైతు

దౌల్తాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో పాటు పిడుగుపాటుకు పొలాల, బోరుబావుల వద్ద కట్టేసిన పశువులు మృత్యువాతపడ్డాయి. అయితే బాధిత రైతులు పరిహారం కోసం రెండేళ్లుగా సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి, దొమ్మాట, తిర్మలాపూర్, గోవిందాపూర్ తదితర గ్రామాల్లో రెండేళ్లలో పిడుగుపాటుకు దాదాపు 20 పశువులు మృత్యువాతపడ్డాయి. ఒక్కో మూగజీవానికి రూ.50 వేలపైనే ఉంటుంది. ఈ లెక్కన మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లో 20 పశువులకు దాదాపు రూ.10 లక్షలపైనే పరిహారం రావాల్సి ఉన్నది. బాధిత రైతులు పరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని మృత్యువాతపడ్డ పశువులకు పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ వేధింపులు భరించలేకే చేరుతున్నారు..



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మడూర్ సొసైటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు

చిన్నశంకరంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో వేధింపులు భరించలేకే కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ సొసైటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు బీమరి యాదగిరి, డైరెక్టర్లు విఠల్‌నాయక్, శ్రీశైలంతోపాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ ఉండేదని, మోసపూరిత మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ప్రజలు సంతోషంగా లేరన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘనవిజయం సాధిస్తుందన్నారు. కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు కుమార్ గౌడ్, శారద సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సొసైటీ సేవలు అమోఘం

● నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయభాస్కర్



కొత్తపల్లి సొసైటీలో నాబార్డ్ చీఫ్ సీజీఎం ఉదయభాస్కర్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చేస్తున్న సేవలు అమోఘమని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి సొసైటీని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ టి. రమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గాను సొసైటీ లాభాల్లో కొంతమేర షేర్లను రైతులకు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ ఏడాది కూడా పది శాతం లాభాన్ని రైతులకు ఇవ్వనుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

● పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక నజర్
● అందుకే 100 రోజుల ప్రణాళిక
● బల్దియా కమిషనర్ ఏ.రవీందర్



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ రవీందర్

జోగిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్త పడొచ్చని అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఏ.రవీందర్ అన్నారు. శుక్రవారం బల్దియాలోని 14, 18 వార్డుల్లో కొనసాగుతున్న 100 రోజుల పారిశుధ్య ప్రణాళికను ఆయన తనిఖీ చేశారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే పారిశుధ్యంపై 100 రోజుల ప్రణాళికను రూపొందించి ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనులను ముమ్మరంగా, యుద్ధప్రాతిపదికన చేపడుతోందన్నారు. ఎక్కడా మురుగునీరు నిలువకుండా, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగకుండా పారిశుధ్య పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయా వార్డుల్లో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను మురుగు కాలువల్లో, ఇంటి బయట పారేయకుండా చెత్త బండ్లకు అందజేయాలని చెప్పారు. ఇదిలా ఉంటే, ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ప్రజా టాయిలెట్లను తనిఖీ చేసి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, సిబ్బంది ఉన్నారు.

సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డా.నాగనిర్మల



డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ కె.నాగనిర్మల నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ బి.రవీందర్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ నాగ నిర్మల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో పీవో ఎంసీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కోహీర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ గాయత్రీదేవీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ నాగనిర్మలకు తక్షణమే పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆకస్మాత్తుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీని ఆ బాధ్యతల నుంచి తప్పించడంతో వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో సర్వత్రా చర్చ నెలకొన్నది.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



బండారి మహేశ్ (ఫైల్)

తొగుట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా తొగుటలో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల, కుటుంబీలకు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బండారు మహేశ్(34)కు భార్య లత, ఇద్దరు కూతుళ్లు ప్రవళ్లిక(8), మనుదీపిక(6), తల్లి ఎల్లవ్వ ఉన్నారు. మహేశ్ గ్రామంలో హమాలీ పనిచేయడంతో పాటు తనకున్న 15 గుంటల వ్యవసాయ భూమిలో పంట సాగుచేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అప్పుచేసి నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. మిగతా భూమిలో వరినాట్లు వేయడానికి దుక్కిని సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే అతడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. ఇళ్ల నిర్మాణానికి డబ్బు లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ పోషణ ఒకవైపు, అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈనెల 22న మధ్యాహ్నం గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రహించి మెరుగైన చికిత్స కోసం అదేరోజు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మహేశ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. తండ్రి శవంపై పడి అతడి పిల్లలు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

● ముగ్గురిపై కేసు

తూప్రాన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలు ఉపయోగిస్తూ అక్రమంగా పేలుళ్లకు పాల్పడుతున్న కాంప్రెషర్ ట్రాక్టర్, పేలుడు పదార్థాలు తుప్రాన్ పోలీసులు పట్టుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై శివానందం కథనం ప్రకారం.. గుండ్రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధి గౌడిగూడెం శివారులోని రాంచంద్రారెడ్డి వ్యవసాయ భూమిలో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బండరాళ్లను పేలుస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ పేలుళ్లకు పాల్పడుతున్న బిక్షపతి, బొల్లబోయిన నర్సింలు, అంబపురం రాజును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేలుడు పదార్థాలు, కాంప్రెషర్ ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

హవ్వ..ఇవేం పనులు..


రోడ్డుకు సమాంతరంగా చేపట్టిన డ్రైన్ పనులు

- కంకరను పరిచి సిమెంట్ మిశ్రమంతో పైపైపూతలు
- సీసీరోడ్డు ఎత్తుకన్నా డ్రైన్ పనులపై విస్మయం
- మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువు

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిపల్ పరిధిలోని యాదవనగర్ కాలనీలో డ్రైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించకపోవడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సమపాళ్లలో ఇసుక, కంకర, సిమెంట్ వినియోగించాల్సి ఉన్నప్పటికీ సిమెంట్, డస్ట్, మిశ్రమంతో నాసిరకంగా కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపంతో కాంట్రాక్టర్ సంబంధీకులు ఇష్టారీతిలో వ్యవహరిస్తుండటంతో ఇవ్వేం పనులంటూ విస్మయం వ్యక్తంచేస్తున్నారు. వరదనీరు నేరుగా డ్రైన్‌లోకి మళ్లేలా రోడ్డుకన్నా తక్కువ లోతులో డ్రైన్ నిర్మాణం చేపట్టాలి. కానీ అవేమి పట్టనట్లుగా సీసీరోడ్డుకు సమాంతరంగా చేపడుతున్నారు. డ్రైన్ బెడ్‌కోసం కేవలం కంకరను నేర్పి పైపైన సిమెంట్, డస్ట్ మిశ్రమంతో కప్పిపెడుతున్నారు. దీంతో మూన్నాళ్లకే దెబ్బతినే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు చోద్యం వహించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ చేర్యాల పట్టణంలో కోట్లాదిరూపాయలు వెచ్చించి చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ సమయంలో ఏమాత్రం పర్యవేక్షించకపోవడంతో నాసిరకంగా పనులు నిర్వహించారు. దీంతో కొద్ది రోజులకే పలు ప్రదేశాలు గుంతలమయమవడంతో పాటు పగుళ్ల పట్టాయి. మళ్లీ సీసీవేయాల్సిన పరిస్థితి తీసుకువచ్చారు. ప్రస్తుతం అదేమాదిరి నిర్లక్ష్యం వహిస్తుండటంతో డ్రైన్ కాలువలు దెబ్బతిని మూన్నాళ్లకే పరిమితమై నిధులు వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. ఈవిషయమై మున్సిపల్ అధికారులు ఇకనైనా స్పందించి నాసిరకం పనులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు నిలిపివేయిస్తా

ముంపుకు గురవుతుందని సమీపంలో ఉన్నవారు అభ్యంతరం తెలపడంతో డ్రైన్ ఎత్తుపెంచి నీటిని మళ్లించేలా చర్యలు తీసుకున్నాం. నాసిరకంగా పనులు చేపడుతున్న విషయాన్ని పరిశీలిస్తా. వెంటనే పనులు నిలిపివేయిస్తా.

\- నాగేందర్, మున్సిపల్ కమీషనర్

వృద్ధుల, దివ్యాంగుల పెన్షన్ పెంచాలి

- ఆగస్టు 3న హుస్నాబాద్‌కు మంద కృష్ణ మాదిగ రాక


సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

హుస్నాబాద్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్ పెంచాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సమావేశంలో మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు పెన్షన్ రూ. 2 వేల నుంచి రూ. 4 వేలకు, వికలాంగుల పెన్షన్ రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచాలని డిమాండ్‌తో ఆగస్టు 3వ తేదీన హుస్నాబాద్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని, దీనికి ఎంఆర్‌పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి వృద్ధులు, దివ్యాంగుల పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు పెరుక పరుశరాములు, ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి బత్తుల చంద్రమౌళి, తదితరులున్నారు.

మహిళల రక్షణకు షీ టీంలు

అక్కన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు షీటీంలు ఏర్పాటు చేశామని ఎస్సై చాతరాజు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేటలోని కేజీవీపీ పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. ఈ రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగానికైనా తప్పకుండా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ చాలా ముఖ్యం అని అన్నారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని ఆయన వివరించారు. తల్లిదండ్రులను విద్యను నేర్పిన గురువులను జీవితంలో ఎప్పుడూ మరచిపోవద్దు అని ఆయన చెప్పారు. ఇందులో ఎంఈవో గుగుతోతు రంగనాయక్, కేజీవీపీ పాఠశాల ఎస్‌వో సరిత తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌దే విజయం

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజాశీర్వాదం కాంగ్రెస్‌కు శ్రీరామరక్షగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమపథకాలకు నోచుకోని ప్రజల కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కల నేరవేరుతుందన్నారు. పేదల ఆకలిపస్తులు నివారించేందుకు సన్నబియ్యంతో పాటు ఎన్నేయేళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులను అందించి ప్రజల మోములో ఆనందం నింపిందన్నారు. ఏకకాలంలో పంటరుణమాఫీ చేసి రైతులకు భరోసా కల్పించిందన్నారు. వంచనపాలనతో రాష్ట్రాన్ని అప్పుల మయం చేయడంతో పాటు స్థానిక సంస్థలను అతలాకుతలం చేసిన బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంజె మల్లేశం, సింగపాక కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

అక్కన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతుకు అధిక లాభాలను ఇచ్చే పచ్చిరొట్ట ఎరువు పంటలు జీలుగ, జనుము, పెసర సాగు చేస్తే రసాయనిక ఎరువులను తగ్గించడంతోపాటు భూసారం పెరుగుతుందని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని గండిపల్లిలో పచ్చిరొట్ట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతూ పచ్చి రొట్టి ఎరువు పంటలు జీలుగ, జనుము, పెసర సాగును విస్మరిస్తున్నారన్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గి, ఆశించిన దిగుబడులు సాధించాలంటే వరి సాగుకు ముందు జీలుగ విత్తనాలు సాగుచేసి, తరువాత భూమిలో కలియ దున్నితే భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇందులో సంస్థ మండల కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొంగోని సురేష్‌గౌడ్


స్థానిక ఎన్నికల కార్యశాలలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మద్దూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో స్థానిక మండల అధ్యక్షుడు మోకు ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు నిర్వహించిన స్థానిక ఎన్నికల కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ కైవసం చేసుకునే కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాపాక బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కూరెళ్ల కిరణ్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శులు బాలు రమేష్, సోగాల మనోజ్, కృష్ణారెడ్డి, సుదర్శ, రాజు, చందు, శ్రీకాంత్, బాలకృష్ణ, తదితరులున్నారు.

స్వర్ణామృతప్రాశస మందు పంపిణీ

దుబ్బాక, జూలై25 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట కేదారీశ్వరాలయంలో శుక్రవారం ఆశ్రమ పీఠాధిపతి మహారాజ్ బాలయోగి రాములు మహారాజ్ ఆధ్వర్యంలో స్వర్ణామృతప్రాశన ఆయుర్వేద మందును రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కివెంకటయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించే దివ్యఔషదాన్ని ఆశ్రమ పీఠాధిపతి మహారాజ్ బాలయోగి రాములు మహారాజ్ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఈదివ్యఔషదం విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలిగించడంతోపాటు పలువ్యాధులను దూరం చేస్తుందన్నారు.

రేపు యోగాసన ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ విభాగంలో యోగాసన ఎంపికల నిర్వహించనున్నారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో వివిధ విభాగాల్లో ఎంపికలుంటాయని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 18 నుండి 28 సంవత్సరాలు, 28 నుంచి 35 సంవత్సరాలు, 35 నుంచి 45 సంవత్సరాలు, 45 నుంచి 55 సంవత్సరాలవయసుల విభాగాల వారిగా పురుషులు, మహిళలకు సెలక్షన్స్ ఉంటాయన్నారు. ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్ బెండింగ్, ట్విస్టింగ్, లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, ఆర్టిస్టిక్ యోగాసన, రిథమిక్ యోగాసన కేటగిరిల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 7, 8న అదిలాబాద్ జిల్లాలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్‌కు పాల్గొంటారన్నారు.

ప్రమాదకర స్థితిలో 74 ఇళ్లు

హుస్నాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కూలి పోయే పరిస్థితిలో ఉన్న ఇళ్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు పరిశీలించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న 74 ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. వర్షాల కారణంగా ఎమర్జెన్సీ కాల్ సెంటర్ 7337347610 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

స్థానిక పోరుపై బీజేపీ కార్యశాల

కొమురవెల్లి, జూలై25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై శుక్రవారం కొమురవెల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప అధ్యక్షతన మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి మండల ప్రభారీ తోకల ఉమారాణి మాట్లాడుతూ..వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జేడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలనీ సూచించారు.జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తెలియచేసి కాషాయజెండాను ఎగురవేయాలన్నారు.

ఏసీపీని కలిసిన మల్లన్న ఆలయ మాజీ చైర్మన్


ఏసీపీ సదానందంతో మాట్లాడుతున్నమల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల వేచరేణి గ్రామానికి చెందిన మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి శుక్రవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందాన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. చేర్యాల మండల పరిధిలోని తమ గ్రామం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతుండటంతో ఇబ్బందులుపడుతున్నామన్నారు. గ్రామాన్ని చేర్యాల పరిధిలో కొనసాగించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

జిల్లా ఏపీఎం అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతి

కోహెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల ఏపీఎంగా పని చేస్తున్న బి తిరుపతి జిల్లా ఏపీఎం యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నూతన ఓబీ కొరకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు.

ఈ నెల 30న జాబ్ మేళా

సిద్దిపేట కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి సూచించారు. 2024-25 విద్యా సంవత్సరం వరకు ఇంటర్మీడియట్ పూర్తైన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, వోకేషనల్ కోర్సుల్లో 75 శాతం మార్కులు, మ్యాథ్స్‌లో 60 శాతం స్కోర్ చేసిన విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావాని చెప్పారు. ఆసక్తిఅర్హత గల అభ్యర్థులు ఈ నెల 30న పది గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని, అభ్యర్థులు తమ వెంట పదవ తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ సెట్‌తో పాటు అభ్యర్థి ఒక ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో రావాలన్నారు. మరిన్నీ వివరాలకు 7569177071, 7981834205 హెచ్‌సిఎల్ ప్రతినిధుల నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలి


చేర్యాలలో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ వనమహోత్సవంలో భాగంగా పెద్దచెరువు కట్టపై మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కలు సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాకాల సీజన్ నేపథ్య ంలో వనమహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఆమె శుక్రవారం చేర్యాల పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా మూడవవార్డు పరిధిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అమృత్ 2.0ద్వారా అంబేడ్కనగర్ కాలనీలో అంబేడ్కర్ భవన్ ఆవరణలో 500కి లోలీటర్ల సామర్థ్యం చేపడుతున్న వాటర్‌ట్యాంక్ పనులు పరిశీలించారు. నాణ్యత, ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వర్షాకాల సీజన్ నేపథ్యంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి దుస్తులు, గ్లౌజ్‌లు ఇతరత్రా సామగ్రి పంపిణీచేశారు. మున్సిపల్ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కలపై ఆరా తీశారు. చిన్నవిగా ఉండటంతో అదనపు మొక్కలు నాటాలని సూచించారు. కాగా ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు దిలీప్‌నాయక్, మునిసిపల్ కమీషనర్ నాగేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జగదేవ్‌పూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జగదేవ్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యప్రకాష్ అన్నారు. శుక్రవారం ఇటిక్యాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రకాష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల చుట్టూ మురికి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి

బెజ్జంకి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రాథమిక పాఠశాలకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని పెండింగ్ బిల్లులు విడుదల చేసి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏను వెంటనే అందించాలని కోరారు.

'ఉత్తి'పోతలు!

(5వ పేజీ తరువాయి)

సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని మిడ్‌మానేరు రిజర్వాయర్‌లో 28 టీఎంసీలకు కేవలం 6.9 టీఎంసీలే ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోనూ 10 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. ఈ నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయి.

గోదావరి వరదే దిక్కు

మేడిగడ్డ వద్ద ఎత్తిపోతలు ప్రారంభించకుంటే గోదావరి నది వరద ప్రవాహమే రిజర్వాయర్లకు దిక్కవుతుంది. మహారాష్ట్రలో కురిసే వర్షాలతో గోదావరి నదిలో వరద పెరుగుతుంది. ఫలితంగా నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే వరద కాలువ ద్వారా ఆ నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తారు. మిడ్‌మానేరు గుండా జిల్లాలోని రిజర్వాయర్లకు ఎత్తిపోసే అవకాశం ఉంటుంది. లేదంటే గోదావరి ప్రవాహంతో నిర్మల్ జిల్లాలో గల కడెం ప్రాజెక్టు నిండినట్లయితే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద వస్తుంది. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు తరలించే పరిస్థితి ఉంటుంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలే స్థానిక రిజర్వాయర్ల భవితవ్యాన్ని తేల్చనున్నాయి. ప్రస్తుత వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పొలాలకు రెండవ తడి సాగునీరు ఉండాలన్నా, యాసంగి పంటలు సాగు చేయాలన్నా, బావులు, బోర్లలో ఊట రావాలన్నా రిజర్వాయర్లలో నీళ్లు ఎత్తిపోయడం వల్లే సాధ్యమవుతుంది. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అధికార యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే జిల్లాలోని రైతాంగానికి ఇబ్బందులు తప్పవు.

భాస్వరాన్ని సేంద్రియ పద్ధతితో కరిగించవచ్చు

సిద్దిపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో భాస్వరాన్ని సేంద్రియ పద్ధతిద్వారా బ్యాక్టీరియాతో కరిగించవచ్చునని ఏరువాక కేంద్రం వ్యవసాయ కళశాల విద్యార్థులు రైతులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా వారు రెండు కిలోల పీఎస్బీనీ విత్తన శుద్ధి, నారు కట్టలు ముంచే పద్ధతి, పొలంలో పశువుల ఎరువుతో కలిపి చల్లడం పద్ధతిని అనుసరించి వినియోగించవచ్చు అన్నారు. తద్వారా భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించడమే కాకుండా భాస్వరం ఎరువులపై పెట్టే ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. నారు కట్టలు ముంచే పద్ధతిలో 20 నుంచి 25 లీటర్ల నీటిలో 500 మిల్లీమీటర్ల పీఎస్బీ ద్రవాన్ని లేదా కిలో పీఎస్బీని కలిపి ఎకరానికి సరిపడే నారు కట్టలను 20 నిమిషాల పాటు ముంచిన తర్వాత నాటు వేసుకోవాలన్నారు. ప్రధాన పొలంలో వాడే విధానంలో 100 కేజీల పశువుల ఎరువులో రెండు నుంచి మూడు కిలోల లేదా ఒక లీటరు ద్రవాన్ని కలిపి చల్లుకోవాలి అని సూచించారు. అనంతరం పీఎస్బీ క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ఏఈఓ అఖిల్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రజ్ఞ రెడ్డి, అఖిల , రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి అండగా మిత్ర బృందం

కొండపాక జూలై 25 (ఆంధ్రజ్యోతి): కష్టంలో అయినా సంతోషంలో అయినా తోడు ఉన్నవారే అసలైన స్నేహితులు. ఏదైనా ఆపద వస్తే ముందుకు వచ్చి అండగా నిలిచి భరోసా ఇచ్చే స్నేహితులు ఎక్కడో ఒక చోట కనబడుతుంటారు. మిత్రుడి తల్లి చనిపోతే అయనకు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన రాజు తల్లి సులోచన మృతి చెందింది. రాజు ఆర్థిక పరిస్థితి అంత మాత్రమే ఉండడంతో ఆయన స్నేహితులు శుక్రవారం 1999-2010 పదో తరగతి మిత్రులు కలిసి 33 వేల రూపాయలను రాజుకు అందజేశారు.

విద్యార్థినుల కుటుంబానికి ఆర్థిక సాయం

బెజ్జంకి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు నిహారిక, హర్షిత తండ్రి రాజేశంగౌడ్ ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యారినుల కుటుంబాన్ని పరామర్శించి రూ. 10,500 నగదును అందజేశారు. విద్యార్థినుల ఉన్నత చదువుల కోసం పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

బూజు పట్టిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్న హోటల్ సీజ్

కొమురవెల్లి, జూలై25 (ఆంధ్రజ్యోతి): బూజు పట్టిన ఆహరపదార్థాలు ఉండటం, నూనెను ఎక్కువ రోజులు ఉపయోగించినట్లు తేలడంతో ఓహోటల్‌ను సీజ్ చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహర పదార్థాలను తయారు చేయడంతో పాటు, కల్తీ ఆహర పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామనీ ఎంపీడీవో శ్రీనివాసవర్మ హెచ్చరించారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని పలు హోటళ్లను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస వర్మ అధ్వర్యంలో ఆకస్మికంగా స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శి హోటల్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహర పదార్థాలను విక్రయించవద్దన్నారు. వేడివేడిగా ఎప్పటికప్పుడు తయారు చేసిన ఆహర పదార్థాలను మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు. పోలీస్ బొమ్మ చౌరస్తాలో ఓ రాజస్థాన్ హోటల్‌లో పాటుగా అపరిశుభ్రమైన వాతావరణలో ఆహర పదార్థాలను తయారు చేస్తున్నట్లు గుర్తించి హోటల్‌ను సీజ్ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో రామవరం


రామవరంలోని 9వవార్డులో వెలుగని వీధి దీపాలు

అక్కన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం గ్రామంలోని పలు వార్డుల్లో వీధి దీపాలు గత ఐదు రోజులుగా వెలుగకపోవడంతో అంధకారం నెలకొంది. రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చీకటి పడిందంటే విషపురుగులు వీధుల్లో నుంచి ఇంట్లోకి వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సిద్దిపేట జిల్లా డీఎం హెచ్‌వో డాక్టర్ ధనరాజ్

సిద్దిపేట జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యం కోసం వస్తున్న వారికి మెరుగైన వైద్య సేవలందించాలని సిద్దిపేట జిల్లా డీఎం హెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని నాసరపురా యూపీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త నమూనాల పరీక్షల రిజిస్టర్లను, ఫార్మసీలోని మందుల నాణ్యతకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ల నాణ్యత, ఐఎల్ఆర్ కోల్డ్ చైన్ విధానాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమానికి సంబంధించి వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని హాస్టళ్లను, పాఠశాలలను సందర్శించాలని సూచించారు. హాస్టల్లో పిల్లలకు అందుతున్న ఆహారాన్ని, మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించాలని సూచించారు.

ముసురు.. ఎడతెరిపి లేని వాన


వరినాట్లకు సిద్ధమైన పొలాలు

(5వ పేజీ తరువాయి)

పలు రహదారులపై వర్షపునీరు చేరి బురదమయంగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై, తోపుడుబండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వారు నానా కష్టాలు పడుతున్నారు.

పంటలకు జీవం.. అన్నదాత హర్షం

జగదేవ్‌పూర్/అక్కన్నపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షం పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్లయింది. ఇప్పటికే ఎప్పుడెప్పుడు నాట్లు వేద్దామా అని ఎదురుచూస్తున్న రైతులకు ఊతమిచ్చింది. ఈ వర్షాలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 5,17,676 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా చేశారు. 1,20,026 లక్షల ఎకరాల్లో వరి, 1,04,011 లక్షల ఎకరాల్లో పత్తి, 25,361 ఎకరాల్లో మొక్కజొన్న, 5,289 ఎకరాల్లో ఇతర పంటలు, మొత్తం 2,54,687 ఎకరాల్లో ఇప్పటివరకు రైతులు పంటలను సాగు చేశారు. పత్తి, మొక్కజొన్న మొలకలు వచ్చిన తర్వాత వర్షాలు లేకపోవడంతో కొన్నిచోట్ల వాలి పోయాయి. పంటల రక్షణకు రైతులు వివిధ రకాలుగా భగీరథ ప్రయత్నాలు చేసి అలసియారు. చేసేదేమీ లేక అన్నదాతలు తీవ్ర మనోవేదనకు గురై వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తూ ఆవేదనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్లయింది. రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో కాలం పోతదనుకున్న వరి రైతులకు ప్రస్తుత వానలతో ఆశలు కలిగాయి. వారం రోజుల క్రితం వరకు లక్ష ఎకరాల వరకు వరి సాగు చేయగా ఈ వానలతో వరి నాట్లు ఊపందుకున్నాయి. ప్రస్తుతం యాభై శాతం వరి సాగు అయిందని, ఆగస్టులో మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ నెల 28 నుంచి ఓపెన్ స్కూల్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు

సిద్దిపేట కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరుకానివారు, పరీక్షలకు హాజరై ఫెయిల్ అయిన విద్యార్థులు 2025లో జరిగే సప్లమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా చేర్యాల మండలం గుర్జకుట శివారులో విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు చేపట్టనున్నందున నేడు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ చేర్యాల ఏడీఈ వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.